క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ సింగిల్‌విండో వైస్‌చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తిశర్మ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాడి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు రాజయ్య, నారాయణగౌడ్, రాజేందర్, శ్రీనివాస్, బాబు, సాహెబ్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు. అంతకుముందు హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును ఆయన నివాసంలో కలిశారు.

కోర్టు ఉద్యోగులకు సన్మానం



సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

వేములవాడ: వేములవాడ కోర్టులో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంటరాజు ఆధ్వర్యంలో శనివారం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. సీనియర్ సివిల్ కోర్ట్ సూపరింటెండెంట్ పురుషోత్తం ప్రమోషన్‌పై వెళ్తుండటం, జూనియర్ సివిల్ కోర్ట్ సూపరింటెండెంట్ అంజయ్యకు పదోన్నతి లభించడంతో వారికి శాలువా కప్పి సన్మానించారు. సబ్ కోర్ట్ న్యాయమూర్తి సట్టు రవీందర్, ఏపీపీ పెద్ది విక్రాంత్, ఏజీపీ గుడిసె సదానందం, సీనియర్ న్యాయవాదులు సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్ , ఇతర న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జిందం కమలాకర్‌కు చిత్తూరులో శనివారం ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ఆయుర్వేద వైద్యులు 200 మందితో సెమినార్ జరిగింది. ఆయుర్వేదంలో కమలాకర్ చేస్తున్న కృషికి గాను వైద్యో నారాయణ బిరుదుతో సన్మానించారు. ఆల్ ఇండియా ఆయుష్ ప్రొఫెసర్ సురేశ్ జేకొటియా, అడవిబిడ్డ జమాల్ కాస్, నెల్లూరు చారిటబుల్ ట్రస్టు ఆనందయ్య తదితరులు కమలాకర్‌ను సన్మానించి అభినందించారు.

ఆలయంలో హోమం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక శ్రీ సీతాలదేవి పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాంతి హోమం నిర్వహించారు. ఆదివారం శ్రీ సీతాలదేవి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ భక్తబృందం పేర్కొన్నారు.

అర్ధరాత్రి వరకు తనిఖీలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): డిసెంబర్ 31 మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ఇంట్లోనే చేసుకోవాలని ఎస్సై దాస సుధాకర్ అన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక వాహనాల తనిఖీ చేపడతామని, మద్యంతాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సిరిసిల్ల క్రైం : ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై రాజు అన్నారు. శనివారం పట్టణంలోని సిద్దార్థ పాఠశాలలో సిరిసిల్ల టౌన్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్, సైన్ బోర్డ్‌లు, హెల్మెట్, వాహనాల చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్లకు క్లస్టర్ కేటాయింపు

తంగళ్లపల్లి: మండలంలో ఉపాధిహామీలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఎంపీడీవో పి. లచ్చాలు క్లస్టర్‌లు కేటాయించారు. మనోహర్‌కు గోపాల్‌రావుపల్లె, చిన్నలింగాపూర్, జిల్లెల్ల, రామచంద్రాపూర్, ఓబులాపూర్, వేణుగోపాల్‌పూర్, గండిలచ్చపేట, లక్ష్మీపూర్, లక్ష్మణ్‌కు చింతలఠాణా, చీర్లవంచ, నేరెళ్ల, సారంపల్లి, దేశాయిపల్లె, పద్మనగర్, మల్లాపూర్, ఇందిరానగర్, సుష్మకు బాలమల్లుపల్లె, నర్సింహులపల్లె, బస్వాపూర్, బద్దెనపల్లి, అంకిరెడ్డిపల్లె, తంగళ్లపల్లి, మండెపల్లి, దేవమ్మకు తాడూర్, పాపయ్యపల్లె, అంకుషాపూర్, రామన్నపల్లె, కస్బేకట్కూర్, రాళ్లపేట గ్రామాలను కేటాయించారు.

ఆరు గ్యారంటీలపై కళాజాత

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సాంస్కృతిక సారథి కళాకారుల బృందం జిల్లా అధ్యక్షుడు ఎడమల శ్రీధర్ అన్నారు. మండలంలోని పదిరలో శనివారం ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు.

కప్పు కాఫీ.. నాలుగు ముచ్చట్లు



- కాఫీ ఫ్లేవర్స్‌కు పట్టణ వాసుల ఫిదా
- నగర తరహాలో కెఫేలకు క్రేజ్
- నయా ట్రెండ్‌తో యువతకు ఉపాధి
- కస్టమర్లతో కాఫీ షాపులు కిటకిట

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: కస్టమర్లకోసం ఇలా కోల్డ్ చాక్‌లెట్ కాఫీ తయారు చేస్తున్న ఈయన పేరు వడ్డేపల్లి ప్రసాద్. సిరిసిల్ల పట్టణంలో రెండేళ్లక్రితం ఐస్‌క్రీం పార్లర్ ప్రారంభించాడు. తమ హోటల్ మెనూలో అన్ని ఐటమ్స్‌తో పాటు కోల్డ్ కాఫీలకు ఆదరణ ఉందని, జోమాటాలో కూడా కాఫీ కోసం ఆర్డర్లు వస్తున్నట్లు చెబుతున్నాడు. కాఫీ రుచికి సిరిసిల్ల ప్రజలు ఫిదా అవుతున్నారు. పట్టణంలో కొత్తగా కాఫీ పబ్స్ పెరుగుతున్నాయి. పొద్దంతా వివిధ పనుల్లో బిజీగా ఉండే వారంతా కాఫీ సెంటర్లకు వచ్చి రిలాక్స్ అవుతున్నారు. సిరిసిల్ల కాఫీ రుచులపై ప్రత్యేక కథనం..



రొటీన్‌కు భిన్నంగా..

ప్రస్తుత జీవన విధానంలో అందరూ టీ తాగడం సర్వసాధారణమే. అయితే రొటీన్‌కు భిన్నంగా రుచికరమైన పానీయం తాగేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. ఈకోవలోనే కాఫీపై మక్కువ పెరుగుతోంది. సాధారణంగా బ్రూ కాఫీ, ఫిల్టర్ కాఫీలు ప్రతి ఇంటా దొరికేవే. ప్రస్తుతం మార్కెట్లో జాతీయ, అంతర్జాతీయంగా వందలసంఖ్యలో కాఫీ బ్రాండ్లు లభ్యమవుతున్నాయి. పట్టణంలని కార్మికులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, ప్రొఫెషనల్స్, రియల్ వ్యాపారులు, రిలాక్స్ కోసం కాఫీ సెంటర్లకు వెళ్తున్నారు. గోపాల్‌నగర్, మార్కెట్, గాంధీచౌక్, ఆఫీస్‌రోడ్, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లోని కాఫీ హబ్స్‌లో వెరైటీ రుచుల్లో కాఫీ దొరుకుతోంది.

ఆహా...కాఫీ..

కొన్నేళ్ల ముందు కాఫీ అంటే కొన్ని హోటల్స్‌లో మాత్రమే ప్రత్యేకంగా దొరికేది. మారిన నాగరికతతో హైదరాబాద్ వంటి మహానగరాల్లో దొరికే కాఫీ ఫ్లేవర్స్‌ను కొందరు యువకులు సిరిసిల్లలో ప్రవేశపెట్టారు. తాగగానే ఆహా అనిపించే రుచుల్లో కస్టమర్లకు అందిస్తున్నారు. స్టోరేజ్ కాకుండా అప్పటికప్పుడు తయారు చేసిన కాఫీని ఇష్టపడుతున్నారు. ఇందుకు స్నేహితులు, ఆఫీస్‌మేట్స్, పొలిటీషియన్స్ తమ అనుచరులతో మాట్లాడేందుకు కాఫీ సెంటర్లకు వస్తున్నారు.

డిఫరెంట్ ఫ్లేవర్స్..

నగరాల్లో మాదిరిగానే సిరిసిల్లలో కూడా డిఫరెంట్ ఫ్లేవర్స్‌లో కాఫీ రుచులను ప్రజలు ఆస్వాదిస్తున్నారు. సాధారణ కాఫీగా బ్రూ వాడతారు. దీనికి తోడుగా కాఫీ బిళ్లలతో చేసే కాఫీని కొన్ని హోటల్స్‌లో వాడతారు. వీటికి భిన్నంగా నెస్ కేఫ్, బ్లాక్ కాఫీ, చాకొలెట్, ఫ్లాట్ వైట్, ఓరియో కాఫీలున్నాయి. వీటికి అదనంగా నేరుగా కాఫీ గింజలతో ఇన్‌స్టంట్‌గా రుచి కాఫీ ప్రియులను అలరిస్తుంది. ఇక బేకరీలు, ఐస్ క్రీం, జ్యూస్ సెంటర్లలో కూడా కోల్డ్ కాఫీ, చాక్లెట్ కాఫీ, చాకో వెనీలా కాఫీలున్నాయి. వేడిగా తీసుకునే వారికి హాట్‌గా..చల్లగా తాగేవారికి కోల్డ్ కాఫీలను హోటల్స్ నిర్వాహకులు అందిస్తున్నారు. అన్నిరకాల ఫ్లేవర్స్ కాఫీలు రోజు సిరిసిల్లలో వేలాది సంఖ్యలో దొరకడం కాఫీకి ఉన్న డిమాండ్‌కు నిదర్శనమని చెప్పొచ్చు.





కాఫీ తాగడం ఇష్టం



మా ఇంట్లో అందరూ కాఫీ ప్రియులే. ఫిల్టర్ కాఫీ తాగడానికి ఇష్టపడుతాం. ఫిల్టర్ సాయంతో డికాషన్ తయారు చేసి ఉంచుతాం. సిరిసిల్లలో వివిధ కంపెనీల ఇన్‌స్టంట్, ఫిల్టర్ కాఫీ పొడులు లభ్యమవుతున్నాయి. ఖాళీ సమయంలో కొత్త ఫ్లేవర్స్‌లో కాఫీ తయారు చేసుకుంటాం. – ఆడెపు ఉమాదేవి, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగిని

అలవాటుగా మారింది



ఉద్యోగ రీత్యా చాలా దేశాలకు వెళ్లాను. అక్కడి సంస్కృతితో కాఫీ తాగడం అలవాటైంది. మొదటగా చెన్నైలో తాగిన ఫిల్టర్ కాఫీ రుచి ఒక వెచ్చని ఆలింగనంలా ఇప్పటికీ గుర్తుంది. సిరిసిల్లలో కూడా హైదరాబాద్‌లో దొరికే కొన్ని ఫ్లేవర్స్ కాఫీ రుచులు బాగుంటున్నాయి. – బొల్లారం నారాయణరెడ్డి, ఎన్‌ఆర్‌ఐ

కాఫీని ఇష్టపడుతున్నారు



హాట్..హాట్‌గా ఉండే కాఫీని ఇష్టపడుతాను. సిరిసిల్లలో రోజూ స్నేహితులు, క్లయింట్స్‌తో కలిసి కాఫీ సెంటర్లలో తాగుతాను. రోజూ రెండు కప్పులు తాగాల్సిందే. హాట్, కోల్డ్, బ్లాక్ కాఫీలు ఇష్టపడుతాను. మా యూత్ ఎక్కువగా కాఫీని ఇష్టపడుతన్నారు. – కూస శ్రవణ్‌కుమార్, ప్రైవేట్ ఉద్యోగి

మూడోరోజు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



సిరిసిల్ల టౌన్ : మాట్లాడుతున్న మీర్జా ఫసహత్ అలీబేగ్



రుద్రంగి: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



తంగళ్లపల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీవో

సిరిసిల్లటౌన్: ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ కోరారు. పట్టణంలో 21,22,23,24,25,26,27,28,29,30 మూడో రోజు దరఖాస్తులు స్వీకరించారు. మూడ్రోజులుగా 13,044 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇతర సమస్యలపై 410 వచ్చాయని మొత్తంగా 13,454 దరఖాస్తులు వచ్చాయన్యానరు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లి, చెక్కపల్లిలో ప్రజాపాలన నిర్వహించగా దరఖాస్తులు అందజేశారు. స్పెషల్ ఆఫీసర్ సైదులు, ఎంపీడీవో రాంరెడ్డి, తహసీల్దార్ సుజాత, సర్పంచ్‌లు జైపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని చంద్రగిరి, శాభాష్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరించారు. చంద్రగిరి, శాభాష్‌పల్లిలో కలిపి 848 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు.

తంగళ్లపల్లి: ప్రజాపాలనను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పూర్మాని మంజుల రాంలింగా రెడ్డి అన్నారు. చీర్లవంచ, చింతలఠాణ, గోపాల్‌రావుపల్లె, ఇందిరమ్మ కాలనీలో ప్రజాపాలనకు హాజరై మాట్లాడారు. సర్పంచులు తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

చందుర్తి : ప్రజాపాలన గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు నాగంకుమార్ కోరారు. జోగాపూర్, రామారావుపల్లె గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలకు హాజరయ్యారు. రామారావుపల్లెలో గ్రామసభను అడిషనల్ కలెక్టర్ గౌతమి సందర్శించారు.

రుద్రంగి: మండలంలోని రూప్లానాయక్ తండాలో అధికారులు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. గ్రామస్తుల నుంచి 115 దరఖాస్తు వచ్చాయి. కార్యక్రమంలో ఎంపీడీవో మాలోతు శంకర్, ఎంపీవో సుధాకర్, కార్యదర్శి, వైద్య సిబ్బంది, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట(ముస్తాబాద్): తెర్లుమద్ది, గూడెం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌లు కిషన్‌రావు, సరిత, తహసీల్దార్ గణేష్, ఎంపీడీవో రమాదేవి పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్, దమ్మన్నపేట, మల్లారెడ్డిపేట, లక్ష్మీపూర్‌తండాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించగా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు. ముస్తఫానగర్‌లో 287, దమ్మన్నపేటలో 370, మల్లారెడ్డిపేటలో 879, లక్ష్మీపూర్‌తండాలో 79 దరఖాస్తులను స్వీకరించారు.

కోనరావుపేట: ప్రజాపాలన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి కొండల్‌రావు కోరారు. మంగళ్లపల్లి, సుద్దాల, కమ్మరిపేటతండా, మరిమడ్ల గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచులు సంతోష్, దేవలక్ష్మి, సూర్యానాయక్, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు

వీర్నపల్లి : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని వీర్నపల్లి ఎస్సై నవత అన్నారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి వరకూ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వవద్దన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

స్టీల్ బాక్స్‌ల వితరణ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో నెలరోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ప్రసాదం తీసుకెళ్లేందుకు గన్న పద్మారెడ్డి అనే భక్తుడు 100 స్టీల్ బాక్సులను సొంత ఖర్చులతో కొనుగోలు చేసి భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా పద్మారెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్ గౌడ్, అర్చకులు నవీన్‌చారి అభినందించారు.

సెల్‌ఫోన్ అందజేత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన గొడుగు హరికుమార్ తనఫోన్ పోగొట్టుకోగా ఎస్సై దాస సుధాకర్ ఆధ్వర్యంలో సీఈఐఆర్ సాయంతో శనివారం బాధితుడికి అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ గుర్తించడంలో కృషిచేసిన పోలీస్ సిబ్బంది అనిల్, లక్ష్మీనారాయణను అభినందించారు.

ఆర్యక్షత్రియ సంఘం అధ్యక్షుడిగా రవి

చందుర్తి : మండలంలోని కిష్టంపేట ఆర్యక్షత్రియ సంఘం అధ్యక్షుడిగా చిలువేని రవిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా లొకటి తిరుపతి, కార్యదర్శిగా బొరుగాయ ప్రసాద్, కోశాధికారిగా ఉగిలే సత్తయ్య, సంయుక్త కార్యదర్శి బాపురావు, లింగంపల్లి నర్సింగంలను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పౌరహక్కుల దినోత్సవం

రుద్రంగి: మండలంలోని వీరునితండాలో అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రంగి ఎంపీడీవో మాలోతు శంకర్, ఆర్‌ఐ నవీన్, హెడ్ కానిస్టేబుల్ బాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని లక్ష్మీపూర్‌కు చెందిన పందుల శారద కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతోంది. మై వేములవాడ ట్రస్టు సభ్యులు, ఇతర దాతల సహకారంతో రూ. 11 వేలను ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేశ్, గొంగళ్ల రవికుమార్, పొలాస రాజేందర్, సంతోష్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చందుర్తి: ధాన్యం ఆరబెట్టేందుకు క్రీడాప్రాంగణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని మండలంలోని జోగాపూర్ గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని 294 సర్వే నెంబర్‌లోని నాలుగెకరాల భూమిని కేటాయించాలని జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, సర్పంచ్ పర్శరాములు , యువకులు, రైతులు కోరారు. క్రీడాప్రాంగణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు.

పరామర్శ

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్‌కు చెందిన పిట్టల రమేశ్ కుటుంబాన్ని ముదిరాజ్ సంఘం నాయకులు శనివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన రమేశ్ ఇటీవల బైక్ అదుపుతప్పి పొలంలో పడి మృతిచెందాడు. మండలశాఖ అధ్యక్షుడు కీసరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బొండ్ల రమేశ్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. 50 కేజీల బియ్యం తక్షణ సాయంగా అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. అన్నబోయిన వెంకన్న, మామిండ్ల దేవయ్య తదిరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ‘ఆది’ విజయోత్సవ ర్యాలీ



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అభిమానులు

చందుర్తి : వేములవాడ ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విజయోత్సవ ర్యాలీ శనివారం రాత్రి మండలకేంద్రంలో కొనసాగింది. ముందుగా మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రధాన వీధుల గుండా డప్పుచప్పుళ్ల మధ్య ర్యాలీ కొనసాగింది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వాగతం పలుకగా తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ ఉరేగింపు సాగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పులి రేణుక, దారం చంద్రం, పులి సత్తయ్య, గొట్టె ప్రభాకర్, దేవుని మల్లేశం, అన్ని వర్గాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఆదివారం రాత్రి న్యూ ఇయర్ వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రమాకాంత్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇతరులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేసి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామరన్నారు. యువత పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గంభీరావుపేట(ముస్తాబాద్): ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడెంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యబీమా హామీలను ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. . సమస్యల పరిష్కారం కోసం ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు బారులు తీరుతున్నారన్నారు. బంగారు తెలంగాణ అని చెప్పి తాకట్టు తెలంగాణగా మార్చారని విమర్శించారు. ఆయన వెంట మండల శాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్



ఓటుహక్కు వినియోగించుకుంటున్న విద్యార్థిని

గంభీరావుపేట(ముస్తాబాద్): మండలంలోని బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల తరహాలో విద్యార్థులకు అవగాహన కోసం ఎన్నికల పోలింగ్ చేపట్టారు. 127 మంది విద్యార్థులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటరు లిస్టు, నామినేషన్ల ప్రక్రియ, గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వరదవెల్లిలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల కోసం చేపడుతున్న అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లత, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్, టైపిస్ట్ వంశీ, ఈజీఎస్, ఐసీడీఎస్ సిబ్బంది, వైద్యాధికారులు, నాయకులు ఆరెపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించాలి

కోనరావుపేట: మండలకేంద్రానికి వెళ్లేదారిలో రోడ్డుకిరువైపులా ఉన్న ప్రమాదకర విద్యుత్ స్తంభాలు తొలగించాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొర్ర రవీందర్, నాయకులు పాకాల కార్తీక్ గౌడ్ సెస్ ఎండీ సూర్యప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే తొలగించాలని కోరారు. ఇటీవలే ధర్మారంలో స్తంభాన్ని ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడన్నారు. ఆర్ అండ్‌బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీఇచ్చారు.

డీఆర్‌డీఏ డీపీఎం నర్సయ్య మృతి



నర్సయ్య (ఫైల్)

సిరిసిల్ల: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం)గా పనిచేసే కుమ్మరి నర్సయ్య(53) శనివారం మరణించాడు. జిల్లాలోని చింతల్‌ఠాణాకు చెందిన నర్సయ్య 20 ఏళ్లుగా డీఆర్‌డీఏ (పేదరిక నిర్మూలన)లో పనిచేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు భార్య భవాని, కూతురు దివ్య, కుమారుడు సన్నీ ఉన్నారు. నర్సయ్య మరణించినట్లు తెలియగానే.. డీఆర్‌డీవో శ్రీనివాస్, ఏపీడీ మదన్‌మోహన్, డీఆర్‌డీఏ సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు నర్సయ్య నివాసానికి వెళ్లి నివాళి అర్పించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కోనరావుపేట: మండలంలోని గొల్లపల్లి (కొలనూర్)లో ఆదివారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పా షా తెలిపారు. నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభంతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.



ఎల్లారెడ్డిపేట : గుండారం ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్‌చేస్తున్న విద్యార్థులు



వేములవాడరూరల్: : భవిత సెంటర్‌లో..

ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు

సిరిసిల్ల, వేములవాడ నియోకవర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

యువతిని బస్సు నుంచి దింపిన కండక్టర్

- ఒరిజినల్ ఆధార్‌కార్డు లేదని నిర్వాకం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణానికి చెందిన జాస్మిని హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. హైదరాబాద్ వెళ్లేందుకు శనివారం వేములవాడలో ఆర్టీసీ బస్సు ఎక్కింది. కండక్టర్ టికెట్ కోసం ఒరిజినల్ ఆధార్‌కార్డు చూపించాలని కోరగా.. ఆ యువతి తన వద్ద ఉన్న ఆధార్‌కార్డును చూపించింది. జిరాక్స్ ఆధార్‌కార్డును ల్యామినేషన్ చేశారని.. ఒరిజినల్ కాదని వేములవాడ నందికమాన్ వద్ద బస్సులో నుంచి దింపేశాడు. ఈ విషయాన్ని తన తండ్రికి తెలిపి, స్థానిక బస్టాండ్‌కు చేరుకుంది. ఈ విషయాన్ని డిపో మేనేజర్ మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు ఉన్నా మార్గమధ్యలో బస్సులో నుంచి దింపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సాక్షి.. డిపో మేనేజర్‌ను వివరణ కోరగా.. అమ్మాయి ఒరిజినల్ ఆధార్‌కార్డు వెంట తీసుకురాలేదని, జిరాక్స్ మాత్రమే తీసుకొచ్చిందని తెలిపారు. మహిళలు తమవెంట ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

పుస్తకాలు అందజేత

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి ఉన్నత పాఠశాలకు పలు పుస్తకాలను లైవ్ అధ్యక్షుడు నరేశ్ కుమార్ అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ అజీమ్‌పాషా, ఐక్యవేదిక నాయకులు మోహన్, రాజు, అరుణ్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.